అక్రమ డిప్యుటేషన్ రద్దు చేసినా..
● జీసీడీవో విధుల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయురాలు 6

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి
● టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి 7

ధ్రువపత్రాల పరిశీలన

● ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు 132 మంది దరఖాస్తు
● ఉద్యోగ విరమణకు దగ్గర ఉన్న వారు సొంత జిల్లాలకు..
● పిల్లలు ఉన్నత ఉద్యోగాలు చేస్తున్న వారు హైదరాబాద్‌కు..
● చేతులు మారిన రూ.లక్షలు
● ఈ నెల చివరి నాటికి పోస్టింగ్ ఇచ్చే అవకాశం


మహబూబ్‌నగర్ డీఈవో కార్యాలయంలో ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు



మహబూబబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పరస్పర బదిలీలు కోరుకున్న ఉపాధ్యాయుల సర్వీస్ బుక్స్, ధ్రువపత్రాల పరిశీలన మహబూబ్‌నగర్ డీఈవో కార్యాలయంలో సోమవారం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 మంది ఉపాధ్యాయులు ఈ బదిలీల కోసం అంగీకరించినట్లు తెలుస్తోంది. తమకు అనుకూలంగా ఉన్న స్థానాలకు వెళ్లేందుకు కొందరు ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులతో రూ.రెండు లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

పరస్పర బదిలీల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యాయులు రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, హైదరాబాద్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాలను కోరుకున్నారు. అత్యధికంగా రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాలకు వెళ్లేందుకు అంగీకారం కుదుర్చుకున్నారు. వీరంతా సోమవారం ఆయా జిల్లాల విద్యా శాఖ కార్యాలయంలో సర్వీస్ బుక్, అండర్ టేకింగ్ సర్టిఫికెట్, జీవో 317, అలాట్‌మెంట్ పత్రాలు, ఇతర ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించారు. వాటిని పరిశీలించి, రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కార్యాలయానికి వివరాలను పంపనున్నారు. తరువాత వారి పరస్పర బదిలీలను

(మిగతా 6లో..)

పోలీస్ స్టేట్‌మీట్‌లో ప్రతిభ చూపండి

● జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్

మహబూబ్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు జరిగే మూడో తెలంగాణ పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ పిలుపునిచ్చారు. స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన క్రీడాకారులను ఉద్దేశించి సోమవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. క్రీడాకారులను అభినందించారు. మీ ప్రతిభ, నిబద్ధత, కష్టపడే ధోరణి మిమ్మల్ని ఈ స్థాయికి చేర్చాయన్నారు. పోలీసులంటే కేవలం చట్టాన్ని అమలుచేయడమే కాకుండా, శారీరక ధృడత్వం, మానసిక స్థైర్యం, సమూహ చైతన్యానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఈ క్రీడలు ఫిట్‌నెస్‌కు మాత్రమే కాకుండా ఏకత్వం, సహకారం, నాయకత్వం విలువలను నేర్పిస్తాయన్నారు. ఆటలో గెలువడం కంటే సమష్టిగా ప్రయత్నించడం ముఖ్యమైనదన్నారు. రాష్ట్ర స్థాయితో పాటు, జాతీయ స్థాయిలో మిమ్మల్ని మీరు నిలబెట్టుకునేందుకు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జానకి, అదనపు ఎస్పీ ఏ.రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, నారాయణపేట ఏఆర్ అదనపు ఎస్పీ రియాజ్‌ఉల్‌హక్ పాల్గొన్నారు.

రూ.12.75 లక్షలు స్వాధీనం



● నారాయణపేట జిల్లాలో ఆరేళ్లలో పేకాటలో పట్టుపడ్డ నగదు ఇది
● 122 కేసులు.. 501 మంది అరెస్టు
● పేకాట క్లబ్‌లుగా మారుతున్న గుట్టలు, జన సంచారం లేని ప్రాంతాలు
● రూ.లక్షల్లో బెట్టింగ్‌లు
● పండుగలు, సెలవుల్లో జోరు
● అప్పుల పాలై వీధిన పడుతున్న ఎన్నో కుటుంబాలు

నారాయణపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నారా యణపేట జిల్లా వ్యాప్తంగా పలు గ్రా మాల్లో పేకాట జోరుగా కొనసాగుతోంది. ఆరేళ్లలో వారి నుంచి పోలీసులు రూ.12,75,540 లక్షల నగదును స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. గుట్టలు, జన సంచారం లేని ప్రాంతాలు, ముళ్లపొదలు, ఫాం హౌస్‌లు, గ్రామ శివారు ప్రాంతాలు, పలు ఇళ్లను పేకాట క్లబ్‌లుగా మారుస్తున్నారు. పండుగలు, సెలవులు, ప్రత్యేక రోజుల్లో ఎక్కువ మంది పేకాట ఆడుతున్నారు. రూ.లక్షల్లో బెట్టింగ్‌లకు పాల్పడటంతో కొందరు అక్రమంగా ఆర్జిస్తుండగా.. మరికొందరు అప్పులపాలవుతున్నారు. తమ వారు పేకాట ఉచ్చులో చిక్కుకొని, ఆర్థికంగా చితికిపోతున్నారని పలువురు మహిళలు కంటతడి పెడుతున్నారు. పేకాట స్థావరాలపై పోలీస్ యంత్రాంగం ఆకస్మిక దాడులు చేసి, పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్నారు. అయినా యథేచ్ఛగా కొనసాగుతోంది. పేకాట ఆడుతున్నవారి సమాచారాన్ని ఫోన్ ద్వారా అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పోలీసులు చెబుతున్నారు. పేకాట ఆడి, జీవితాలను నాశనం చేసుకోవద్దని అంటున్నారు.

జిల్లాలో పేకాట కేసులు ఇలా..

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 2019 నుంచి 2024 వరకు పేకాటకు సంబంధించి 122 కేసులు నమోదయ్యాయి. 501 మందిని అరెస్టు చేసి, రూ.12,75,540 లక్షల నగదును సీజ్ చేశారు. 2019లో 20 కేసులు నమోదు చేయగా 49 మందిని అరెస్టు చేసి రూ.32,340 నగదును సీజ్ చేశారు. 2020లో 26 కేసులు నమోదు చేయగా, 151 మందిని అరెస్టు చేసి రూ.3,42,980, 2021లో 14 కేసులు నమోదు చేయగా, 84 మందిని అరెస్టు చేసి రూ.58,580, 2022లో 20 కేసులు నమోదు చేయగా, 144 మంది అరెస్టు చేసి రూ.6,75,420, 2023లో 21 కేసులు నమోదు చేయగా, 110 మంది అరెస్టు చేసి రూ.2,01,810 నగదును సీజ్ చేశారు. 55 మొబైల్స్, 30 బైక్స్‌ను పట్టుకున్నారు. 2024లో 21 కేసులు నమోదు చేయగా, 64 మంది అరెస్టు చేసి రూ.1,45,410 నగదును సీజ్ చేశారు. 33 మొబైల్స్, 29 బైక్స్‌ను పట్టుకున్నారు.

తాజాగా నమోదైన దాడులు

● గత డిసెంబరు 7న మక్తల్ మండలం టేకులపల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో కొందరు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఎనిమిదిని పట్టుకొని, రూ.19,000 నగదును, పది బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్స్ స్వాదీనం చేసుకున్నారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు.

● ఈ నెల 11న నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ శివారులో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఐదుగురి నుంచి రూ.6,700 నగదు, ఐదు బైక్స్ ఒక ఆటో స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేశారు.


మక్తల్ మండలం టేకులపల్లిలో పట్టుబడ్డ నగదు, సెల్‌ఫోన్లు


మహబూబ్‌నగర్ పట్టణం

మహబూబ్‌నగర్ ఇక కార్పొరేషన్
● గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం
● మార్గదర్శకాలు వెలువడిన వెంటనే వార్డుల పునర్విభజన
● దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామ పంచాయతీల విలీనం
● 51 డివిజన్‌లు అయ్యే ఛాన్స్.. కార్పొరేషన్ హోదాలోనే ఎన్నికలు
● నిధుల కోసం ఇప్పటికే సీఎంకు ప్రతిపాదనలు ఇచ్చాం: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి 6

నేటి నుంచి గ్రామ సభలు

● అభ్యంతరాలు, కొత్త దరఖాస్తులు స్వీకరించాలి
● మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రారంభించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు మంగళవారం నుంచి గ్రామ సభల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయ ప్రధాన సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్ రావుతో కలిసి నియోజకవర్గ, మండల, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 24వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలను నిర్వహించాలన్నారు. గ్రామ సభల్లో ఫ్లెక్సీలు, తాగు నీరు, నీడ ఏర్పాటుకు టెంట్, మైక్ సెట్ తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. సభల వద్ద ఈ నాలుగు పథకాల అర్హుల జాబితాను ప్రదర్శించాలన్నారు. ఫిర్యాదులపై రిజిష్టర్‌లను ఏర్పాటు చేసి, దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. గ్రామ సభల సమయం, నిర్వహించే ప్రదేశంపై ముందు రోజు గ్రామంలో టాంటాం వేయించాలన్నారు. సభల సమాచారాన్ని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులకు తెలుపాలన్నారు. సభల్లో మహిళా సంఘాల మహిళలు, ఉపాధి హామీ పనులు నిర్వహించిన కుటుంబాలు పాల్గొనేలా చూడాలన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులను భాగస్వాములను చేయాలన్నారు. ఆయా పథకాలకు సంబంధించి అభ్యంతరాలు, కొత్తగా దరఖాస్తులు చేసుకుంటే స్వీకరించాలన్నారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని సూచించారు. జాబితాలో పేరు లేకుంటే గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● పేర్లు లేని వారు గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చు
● నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఊట్కూర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. సోమవారం సాయంత్రం ఆమె ఊట్కూర్ ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్‌లో గ్రామ సభల బృందం సభ్యులతో సభల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం నుంచి నిర్వహించే గ్రామ సభల్లో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాల లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించాలన్నారు. జాబితాలో పేర్లు రాని వారు ఉంటే దరఖాస్తులను స్వీరించాలన్నారు. సభకు హాజరు కాని వారు ఉంటే మండల కేంద్రాల్లో ప్రజాపాలన సేవ కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం గురించి గ్రామ సభల్లో సమగ్రంగా వివరించాలన్నారు. సభలకు వచ్చే ప్రజల కోసం కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ చింత రవి, ఎంపీడీవో ధనుంజయ్‌గౌడ్, ఏవో గణేష్‌రెడ్డి, ఏపీవో ఎల్‌ఎంఎన్ రాజు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మైలారంలో మైనింగ్ మంటలు 6
● మా గ్రామంలో గుట్టను తవ్వొద్దంటూ పురుగుల మందుతో రోడ్డెక్కిన మహిళలు
● గ్రామానికి వస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, పౌర హక్కుల నేత గడ్డం లక్ష్మణ్‌ను అరెస్టు చేసిన వెల్దండ పోలీసులు
● ఆదివారం అర్ధరాత్రి నుంచి కొనసాగిన రైతుల అరెస్టులు

మా తాత, నాన్న ఆశయాలు నెరవేరుస్తా

● ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ధన్వాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ధన్వాడకు సేవ చేయాలన్న అవకాశం మా తాత దివంగత చిట్టెం నర్సిరెడ్డి, నాన్న చిట్టెం వేంకటేశ్వర్‌రెడ్డికి రాలేదని, తనకు అవకాశం కల్పించినందుకు మీ నమ్మకాన్ని వమ్ము చేయనని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి అన్నారు. ధన్వాడలో సోమవారం డిగ్రీ కళాశాలను, ఎమ్మెల్యే నిధులతో మరమ్మతు చేసిన పాత తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. డిగ్రీ కళాశాల సిబ్బంది ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మా తాత, నాన్న ఆశయాలను నెరవేరుస్తానన్నారు. ధన్వాడను అభివృద్ధి చేయడంలో ముందుంటానని చెప్పారు. గత పాలకులు ధన్వాడ గురించి పట్టించుకోలేదన్నారు. పేరుకే మండల కేంద్రంగా ఉందన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక రూ.కోటికి పైగా నిధులు మంజూరు చేయించానన్నారు. తన పదవీకాలం పూర్తయ్యేలోగా డిగ్రీ కళాశాలకు సొంత భవనం మంజూరు చేయిస్తానన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నమూనను ఎమ్మెల్యే ప్రారంభించారు. లక్ష్మీవాడలో అండర్ గ్రౌండ్ పైపు లైన్ పనులకు భూమి పూజచేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ శివారెడ్డి, డైరెక్టర్లు నీరటి రాంచంద్రయ్య ముదిరాజ్, జట్రం లక్ష్మయ్యగౌడ్, విండో చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి, తహసీల్దార్ సింధూజ, ఎంపీడీవో సాయి ప్రకాష్, ఎంఈవో గాయత్రి పాల్గొన్నారు.


దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతు రామకృష్ణ

రైతు ఆత్మహత్యాయత్నం

● పట్టా భూమిలో రోడ్డు వేస్తున్నారని ఆవేదన

దేవరకద్ర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తన పట్టా భూమిలో అక్రమంగా బాట వేస్తున్నారని అడ్డుకున్న తనపై దాడి చేశారని ఆరోపిస్తూ సోమవారం ఓ రైతు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకున్నది. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన రైతు రామకృష్ణకు గ్రామంలోని 88 సర్వే నెంబరులో ఆరు ఎకారుల పట్టా భూమి ఉన్నది. ఆయన వ్యవసాయ భూమిలో నుంచి బాట కోసం కొందరు రైతులు దౌర్జన్యంగా మట్టిని వేశారు. మట్టిని వేయకుండా అడ్డుకునేందుకు వెళ్లిన రామకృష్ణపై దాడి చేశారు. న్యాయం చేయాలని పోలీసులు, రెవెన్యూ అధికారులను సంప్రదించినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను తహసీల్దార్ చాంబర్‌లోనే ఒంటిపై పోసుకున్నాడు. చాంబర్‌లో ఉన్న కొంత మంది. పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. అనంతరం కార్యాలయం ముందు తన భార్య అరుణతో కలిసి నిరసన చేపట్టగా తహసీల్దార్ కృష్ణయ్య స్పందించి రైతు నుంచి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. గ్రామానికి వచ్చి స్థలాన్ని పరిశీలించి నక్ష ప్రకారం నాయ్యం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతు ఆందోళనను విరమించాడు.

ప్లాట్లు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

» కలెక్టరేట్ ఎదుట గ్రామస్థుల ఆందోళన



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న ఉలిగేపల్లి గ్రామస్థులు

గద్వాల న్యూటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇచ్చిన ప్లాట్లను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని, లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని కోరుతూ సోమవారం మల్దకల్ మండలం ఉలిగేపల్లి గ్రామస్థులు కలెక్టరేట్ ముందు ఆందోళన వ్యక్తం చేస్తూ అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ... మల్దకల్ మండలం ఉలిగేపల్లిలో సర్వే నెంబరు 102, 103లో సుమారు 85 మంది నిరుపేదలకు 1995వ సంవత్సరంలో ఇంటి స్థలాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉలిగేపల్లి గ్రామానికి చెందిన తిమ్మయ్య అనే వ్యక్తి తనకు ఇచ్చిన ప్లాట్లలో ఇంటి నిర్మాణం చేసుకొని మళ్లీ ఇప్పుడు ఇంకో ఇంటి నిర్మాణం చేపడుతున్నాడన్నారు. ఇది పూర్తిగా అక్రమ నిర్మాణం.. ఎలాంటి పట్టాలు లేవని, బిల్డింగ్ అనుమతి కూడా తీసుకోలేదన్నారు. నిజమైన పట్టాదారులు ఈ ప్లాట్లు మావి అని అడిగితే బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నాడని, ఇవే కాకుండా ఇంకా 10 ప్లాట్లు కూడా అక్రమంగా ఆక్రమించుకొని పశువుల దొడ్డి ఏర్పాటు చేసుకున్నాడన్నారు. కాబట్టి మాపై దయ ఉంచి అక్రమ నిర్మాణాన్ని ఆపివేయడంతో పాటు వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని గ్రామస్థులు నర్సింహులు, గోవిందమ్మ, సత్యమ్మ, కుర్వ తిమ్మప్ప, శివరాములు, సరోజమ్మ తదితరులు కలెక్టర్‌ను కోరారు.

డిప్యుటేషన్ రద్దు చేసినా జీసీడీవో విధుల్లో కొనసాగుతోన్న టీచర్



సమగ్రశిక్ష అభియాన్ కార్యాలయంలో విధుల్లో జీసీడీవో సీట్లో కూర్చొని ఉన్న ఉపాధ్యాయురాలు రాధ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల పర్యవేక్షకురాలిగా అక్రమంగా పొందిన అధికారిణి డిప్యుటేషన్‌ను డీఈవో ప్రవీణ్‌కుమార్ నాలుగు రోజుల క్రితం రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాత్కాలిక ఇన్‌చార్జి జీసీడీవో ఉపాధ్యాయులు రాధపై పలు ఆరోపణలు ఉన్నాయని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నుంచి ఫిర్యాదులు రావడం 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో జీసీడీవో డిప్యుటేషన్ రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయినప్పటికీ శనివారం. సోమవారం కూడా ఆమె విధులకు హాజరు కావడం గమనార్హం. డీఈవో డిప్యుటేషన్ రద్దు చేసినా మళ్లీ విధుల్లో కొనసాగడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ నాయకుల అండదండలతోనే కార్యాలయ విధులకు వస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

తాత్కాలిక డిప్యుటేషన్‌కు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేజీబీవీల పర్యవేక్షకురాలిగా నియమించబడ్డానని, మళ్లీ జిల్లా ఉన్నతాధికారి నుంచి ఉత్తర్వులు వస్తేనే విధులకు రాకుండా ఉంటానని అప్పటిదాకా విధులకు వస్తానని విద్యాశాఖ కార్యాలయ సిబ్బందితో చెప్పుకుంటున్నట్లు ఓ విద్యార్థి సంఘం నాయకుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జిల్లా కలెక్టర్, రాష్ట్ర సమగ్రశిక్షా అభియాన్, విద్యాశాఖ అధికారులు స్పందించి సంబంధిత కేజీబీవీ తాత్కాలిక జీసీడీవోను విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ పోస్టుకోసం పరీక్ష రాసి మొదటి ర్యాంకులో ఉన్న వారిని వెంటనే నియమించాలని, జీసీడీవోను నియమించక పోవడం వల్ల కేజీబీవీలలో పర్యవేక్షణ కుంటుబడుతోందన్నారు. ఈ విషయమై డీఈవో ప్రవీణ్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా తాత్కాలిక జీసీడీవో డిప్యుటేషన్ రద్దు చేశాం.. కలెక్టర్‌తో అప్రూవల్ తీసుకుంటామని తెలిపారు.

బాధిత రైతులకు పరిహారం పంపిణీ



బాధిత రైతులకు పరిహారం చెక్కులను అందజేస్తున్న రేంజ్ అధికారి దేవజ

మన్ననూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో మేతకోసం వెళ్లిన ఆవులపై పలు సందర్భాల్లో పెద్దపులి దాడి చేసి చంపేసిన ఘటనలో వైల్డ్‌లైఫ్ ద్వారా మంజూరైన పరిహార చెక్కులను మన్ననూరు అటవీ డివిజన్ కార్యాలయంలో రేంజ్ అధికారి దేవజ సోమవారం పంపిణీ చేశారు. మన్ననూరుకు చెందిన జయేందర్, మంజుల, పుల్లాయపల్లి పెంటకు చెందిన క్రిష్ణ, రవి, మల్లికార్జునల ఆవులు పెద్దపులి దాడిలో చనిపోయాయి. అటవీ అధికారులు పంచనామా చేసి ఆవుల విలువను అటవీ ఉన్నతాధికారులకు నివేదించారు. వైల్డ్‌లైఫ్ ద్వారా మంజూరైన రూ. 86,500 విలువ గల పరిహార చెక్కులను బాధిత రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ, అడవుల్లో మేతకు వెళ్లిన పశువులపై పెద్దపులులు దాడి చేస్తే తమకు అటవీ రేంజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, పశువులకు నిర్దేశించిన ప్రాంతాల్లో మేత మేపుకోవాలని పశు పోషకులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీకాంత్, సెక్షన్ అధికారి శ్రీకాంత్, బీట్ అధికారులు మధుసూదన్, ప్రవీణ్ పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న మహబూబ్‌నగర్ జిల్లా జట్టు

కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి 46వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ జట్టు తృతీయ స్థానంలో నిలువగా.. కరీంనగర్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో మూడు రోజులుగా కొనసాగుతున్న పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు వరంగల్‌పై 18-16 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఆదిలాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. కరీంనగర్ జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ విజేతలకు బహుమతులను అందజేశారు.

పెండింగ్ రూ.37 కోట్లు

» బోనస్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్న రైతాంగం
» వనపర్తి జిల్లా వ్యాప్తంగా 11వేల మందికి పైగా రైతుల ఎదురుచూపులు
» తొలి విడతలో వేగవంతంగా ఖాతాల్లో జమ చేసిన అధికారులు
» నెల రోజులకు పైగా ఆలస్యం అవుతుండటంతో ప్రభుత్వంపై రైతుల అసంతృప్తి
» నిధుల కొరతతోనే ఆలస్యం



ఇంకా రూ.9వేలు జమ కాలేదు



నేను 40 రోజుల కిందట ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సన్న రకం ధాన్యాన్ని 18 క్వింటాళ్లు అమ్మాను. 18 క్వింటాల్‌లకు రూ.40వేల నగదు జమ అయింది. కానీ ప్రభుత్వం బోనస్ డబ్బులు ఇంకా రూ.9వేలు నాకు జమ కాలేదు. ప్రభుత్వం స్పందించి త్వరలో బోనస్ డబ్బులు వేయాలని కోరుతున్నాం.

- కాట్రావత్ శరత్, గోపాల్‌పేట



చిట్యాలలో వడ్ల కొనుగోలు కేంద్రం(ఫైల్)

వనపర్తి అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రధానమైన హామీలలో ఒకటి. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీ మేరకు వానాకాలం సీజన్‌కు సంబంధించి సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ డబ్బులు చెల్లించింది. మొదట్లో ధాన్యం విక్రయించిన రైతాంగానికి వేగవంతంగా ఖాతాల్లో జమ చేసింది. అయితే గత నెల డిసెంబరు 20వ తేదీ నుంచి సన్న ధాన్యం విక్రయించిన రైతాంగానికి బోనస్ డబ్బులు చెల్లించడం లేదు. దీంతో వనపర్తి జిల్లా వ్యాప్తంగా దాదాపు 11 వేలకు పైగా రైతులకు గాను రూ.37 కోట్లకు పైగా బోనస్ డబ్బులు పడడం లేదు. విక్రయించిన ధాన్యానికి అయినా ప్రభుత్వం వేసే బోనస్ డబ్బులు వస్తాయో రావో అని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై పౌర సరఫరాల శాఖ అధికారులను రైతులు సంప్రదిస్తున్నా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● నిధుల కొరతతోనే ఆలస్యం

రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యం సాగును ప్రోత్సహించేందుకు బోనస్ ప్రకటించింది. క్వింటాల్ సన్న వడ్లకు రూ. 500 చొప్పున చెల్లిస్తామని ప్రకటించడంతో రైతులు జిల్లా వ్యాప్తంగా పెద్ద మొత్తంలో సన్నాలు సాగు చేశారు. గ్రేడ్ ఏ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 ప్రభుత్వం చెల్లిస్తుండగా దానికి అదనంగా సన్న రకం వడ్లకు రూ.500 ఇస్తున్నారు. ఇచ్చిన హామీ మేరకు మొదట్లో డిసెంబర్ రెండవ వారం వరకు క్రమంగానే రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఆ తరువాత రైతులకు బోనస్ డబ్బులు జమ కాకపోతుండటంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. అయితే ప్రభుత్వం వద్ద నిధుల కొరతతోనే సన్నాలకు బోనస్ ఇవ్వడం లేదనే చర్చ జరుగుతున్నది. సన్న ధాన్యాన్ని విక్రయించిన రైతుల వివరాలను నిర్వాహకులు ఆన్‌లైన్ ప్రొక్యూర్మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎస్)లో నమోదు చేసిన అనంతరం పౌర సరఫరాల శాఖ మార్కెటింగ్ అధికారికి లాగిన్ పంపిస్తారు. వీటి ఆధారంగా రైతుల బ్యాంకు ఖాతాలకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఈ కుబేర్ యాప్ ద్వారా నగదు చెల్లిస్తారు. అయితే ప్రభుత్వం వద్ద నిధుల కొరతతోనే ఆలస్యమవుతుందనేది సమాచారం.

● ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి...

ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు సంబంధించి వనపర్తి జిల్లా వ్యాప్తంగా 21వేల 200 మంది రైతులు 128 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని విక్రయించారు. వీటికి గాను ఇప్పటి వరకు 10వేల 200 మంది రైతులకు సంబంధించిన 54వేల మెట్రిక్ టన్నులకు రూ.27 కోట్లు బోనస్ డబ్బులు చెల్లించారు. ఇంకా 11 వేల మంది విక్రయించిన 74వేల మెట్రిక్ టన్నుల సన్నాలకు రూ.37 కోట్లు బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు గతంలో 20వ తేదీ నుంచి పెండింగ్‌లో ఉంచారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు త్వరగా బోనస్ డబ్బులు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

మైలారంలో.. మైనింగ్ మంటలు

» తమ గ్రామంలో గుట్టను తవ్వొద్దంటూ పురుగుల మందుతో రోడ్డెక్కిన మహిళలు
» ఆదివారం అర్ధరాత్రి నుంచి కొనసాగిన రైతుల అరెస్టులు
» మైలారం గ్రామానికి వస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, పౌర హక్కుల నేత గడ్డం లక్ష్మణ్‌ను అరెస్టు చేసిన వెల్దండ పోలీసులు

నాగర్‌కర్నూల్/అచ్చంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారంలో మైనింగ్ మంటలు తీవ్ర ఉద్రిక్తతకు దారి తీశాయి. తమ గ్రామంలో మైనింగ్ కొనసాగించడం ద్వారా ఉపాధి కోల్పోతున్నామని గ్రామస్థులు తమ ఆందోళనను పాలక ప్రభుత్వాల దృష్టికి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో మైనింగ్ వివాదం మైలారం గ్రామస్థుల ఆత్మ పోరాటానికి ప్రతీకగా మారింది. పోలీసులు యావత్తు ప్రభుత్వ యంత్రాంగం మైనింగ్ కాంట్రాక్టర్లకు వత్తాసు పలకడంతో గ్రామస్థుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

గత ప్రభుత్వం హయాంలోనే అనుమతులు

బల్మూరు మండలం మైలారం గ్రామంలో ఖనిజ తవ్వకాలకు గత ప్రభుత్వ హయాంలోనే అనుమతులు ఇచ్చారు. అప్పటి నుంచి అక్కడ ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. 250 ఇళ్లు, 1,200 మంది జనాభా ఉన్న మైలారంలో దాదాపు 800 మంది ఓటర్లున్నారు. 121 సర్వే నెంబరులో మైలారం గుట్ట ఉండగా దాని విస్తీర్ణం 122 ఎకరాలు. అందులో 35 ఎకరాల విస్తీర్ణాన్ని 2041 వరకు వరంగల్, ఖమ్మంకు చెందిన వారు లీజుకు తీసుకున్నారు.

మైలారం గుట్టనే వారికి బువ్వ..

మైలారం గుట్టను ఆధారంగా చేసుకుని అనేక కుటుంబాలు జీవిస్తున్నాయి. మైలారం గుట్టపై మేకలు, గొర్లను మేపుకుంటూ వ్యవసాయధార కుటుంబాలు జీవనాన్ని కొనసాగిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో లభించే ఉత్పత్తులను గ్రామవాసులు సేకరించి పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తారు. అంతేకాకుండా ఈ గుట్టపై నెమళ్లు, అడవి పందులు జీవిస్తున్నాయి.

రైతుల అరెస్టుల పట్ల పెల్లుబుకుతున్న నిరసన

మైలారం గ్రామంలో రైతులు చేపట్టనున్న రిలే నిరాహార దీక్షకు భగ్నం కలిగించేందుకు పోలీసులు రైతులను అరెస్టు చేస్తున్నారు. అరెస్టుల పట్ల గ్రామంలో నిరసన పెల్లుబికుతోంది. అర్ధరాత్రి నుంచి పొలాల్లో ఉన్న రైతులను అరెస్టు చేయడం ద్వారా పోలీసులు విమర్శలను ఎదుర్కొంటున్నారు. సోమవారం తెల్లవారుజామున కూడా తమ భర్తలను వదిలిపెట్టకపోవడంతో మహిళా రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని రోడ్డెక్కారు. పోలీసులు ఇతర రాజకీయ నాయకులు రాకుండా రోడ్డుకు ముళ్ల కంచెను అడ్డంగా వేశారు.

ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్టు

మైలారం బాధితులు చేయనున్న రిలే నిరాహార దీక్షకు హాజరయ్యేందుకు వస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు గడ్డం లక్ష్మణ్‌ను పోలీసులు వెల్దండలో అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తమ అరెస్టు అప్రజాస్వామికమని నిర్బంధాలు ఈ ప్రభుత్వంలో అధికమయ్యాయని వారు విమర్శించారు.

మైలారం మైనింగ్‌పై ఇంకా వివాదాలు ఎంత వరకు కొనసాగుతాయో వేచి చూడాల్సి ఉంది.

పేలుళ్లతో ఇళ్లకు నెర్రెలు

మైలారం గుట్టపై మైనింగ్ కాంట్రాక్ట్ పొందిన వాళ్లు నిరంతరం చేస్తున్న పేలుళ్లతో గుట్ట, దాని పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఒకరకంగా చెప్పాలంటే మైనింగ్ పేరిట ఇక్కడ విధ్వంసం జరుగుతోంది. 2041 వరకు తవ్వకాలకు అనుమతులు తీసుకున్న కాంట్రాక్టర్లు త్వరితగతిన తమ పనిని పూర్తి చేసుకోవాలన్న ఆలోచనతో నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్‌లు చేపడుతున్నారు. దీంతో ఇళ్ల నెర్రెలు బారుతున్నారు.

మైలారం ప్రయోజనాలను కాపాడుతాం



మైలారం రైతుల ప్రయోజనాలపై అక్కడ కల్పించాల్సిన సదుపాయాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. అక్కడి ప్రజలతో త్వరలోనే సమావేశం నిర్వహించి వారు కోరుకున్న విధంగా ప్రయోజనాలను నెరవేరుస్తాం. అటవీ ప్రాంతంతో వారికి ఉన్న అనుబంధాన్ని, జీవన విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో విడదీయం.

- వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

● మా ఊరు నాశనం అవుతుంది

తవ్వకాలు చేస్తే మా ఊరు పూర్తిగా నాశనం అవుతుంది. నిలుపుదల చేసే వరకు మేము పోరాడుతునే ఉంటాం. మా పిల్లల భవిష్యత్తు నాశనం చేస్తున్నారు. ఉన్నోళ్లను బతికించేందుకే పేదోళ్ల కడుపు కొడుతున్నారు.

- మొట్ల చంద్రమౌళి

● ప్రాణాలైనా వదులుతాం.. ఊరిని వదలం

మైనింగ్ ఆపకపోతే ప్రాణాలైన వదులుతాం.. కానీ ఊరుకునేది లేదు. మా బతుకుదెరువు మొత్తం ఈ గుట్టపైనే ఎవరి కోసమో మా పొట్ట కొట్టొద్దు.

- బక్కమ్మ, మైలారం

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా మైనింగ్ చేయొద్దు

- పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ రావు

హైదరాబాద్ సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా మైలారం గ్రామంలో గుట్ట ధ్వంసం చేయడానికి వ్యతిరేకంగా గ్రామస్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు పౌరహక్కుల సంఘం మద్దతు తెలుపుతుందని ఆ సంఘం ప్రధానకార్యదర్శి ఎస్.నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీక్ష ప్రారంభానికి వెళ్తున్న ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ప్రొఫెసర్ హరగోపాల్‌ను వెల్దండ పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గుట్ట విధ్వంసంతో మైలారం గ్రామ ప్రజలు జీవించే హక్కు ప్రమాదంలో పడుతుందని, శాస్త్రవేత్తలు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా మైనింగ్ చేయడానికి వీలు లేదని చట్టాలు చెబుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఎంఎల్‌ఏ వంశీకృష్ణలు కలిసి అక్రమానికి పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. ప్రజాశేయ బద్ధంగా నిరాహారదీక్ష చేయాలని అనుకున్న గ్రామస్థులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. అరెస్ట్‌చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ధ్రువపత్రాల పరిశీలన

(5వ పేజీ తరువాయి)

ఒకే చేసి, ఈ నెల చివరి నాటికి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

అంతా డబ్బుమయం

గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేసి జీవో 317లో రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరితో పాటు హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలకు వెళ్లిన వారు, ఉద్యోగ విరమణకు ఏడాదిలోపు సమయం ఉన్న వారు మళ్లీ సొంత జిల్లాలు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేటలకు వచ్చేందుకు మక్కువ చూపుతున్నారు. సుదీర్ఘ సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు, పిల్లలు ఉన్నత ఉద్యోగాలు చేస్తూ హైదరాబాద్, రంగారెడ్డిలో స్థిరపడ్డవారు, భార్యా భర్తలు ఉద్యోగులు అయి ఉండి, హైదరాబాద్‌లో స్థిరపడ్డవారు ఎంత డబ్బయినా ఖర్చు చేసి, అక్కడికే వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. వారు పరస్పర బదిలీకి అనుకూలంగా ఉన్న వారితో అంగీకారం చేసుకున్నారు. అందుకోసం రూ.లక్షలు చేతులు మారినట్లు తెలుస్తోంది. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న వారు డబ్బుల కోసం హైదరాబాద్, మహబూబ్‌నగర్ పట్టణాల్లోని స్థలాలను వదిలి.. జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో 52 మంది పరస్పర బదిలీలు



మహబూబ్‌నగర్ జిల్లాలో 52 మంది ఉపాధ్యాయులు పరస్పర బదిలీ కోరుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 34 మంది ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు, ఇతర జిల్లాల నుంచి 18 మంది ఉపాధ్యాయులు మహబూబ్‌నగర్‌కు వచ్చేందుకు కోరుకున్నారు.

ఎ.ప్రవీణ్‌కుమార్, డీఈవో

మహబూబ్‌నగర్ ఇక కార్పొరేషన్

» గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం
» మార్గదర్శకాలు వెలువడిన వెంటనే వార్డుల పునర్విభజన



మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయం

మహబూబ్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ ఇక కార్పొరేషన్‌గా మారనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటన చేయగా, తాజాగా గెజిట్ విడుదల చేయడంతో కార్పొరేషన్ కల నెరవేరింది. కార్పొరేషన్‌లో మహబూబ్‌నగర్ మునిసిపాలిటీతో పాటు మహబూబ్‌నగర్ మండలంలోని దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామాలను విలీనం చేశారు. దాంతో ఆ రెండు గ్రామాలను సర్పంచ్ ఎన్నికల నుంచి మినహాయించనున్నారు. కార్పొరేషన్‌కు సంబంధించి మార్గదర్శకాలు వెలువడిన వెంటనే కొత్తగా చేరిన రెండు గ్రామాలను కలిపి వార్డులు విభజించనున్నారు. మునిసిపాలిటీలో ప్రస్తుతం 49 వార్డులు ఉండగా కొత్తగా విలీనమైన గ్రామ పంచాయతీలను కలుపుకుని వార్డుల పునర్విభజన చేయనున్నారు. మొత్తం 51 డివిజన్‌లు ఏర్పాటుయ్యే అవకాశం ఉంటుంది. అంటే ప్రస్తుతం ఉన్న వార్డులలో కొంత మార్పులు చేర్పులు జరుగనున్నాయి. 2018 నుంచే కార్పొరేషన్‌కు ప్రతిపాదనలున్నా అమలు కాలేదు. అప్పట్లో మహబూబ్‌నగర్ నియోజకవర్గంతోపాటు జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలలోని కొన్ని గ్రామాలను కలిపి, కార్పొరేషన్ చేయాలని ప్రతిపాదించారు. అయితే మిగతా నియోజకవర్గాలనుంచి అభ్యంతరాలు రావడంతో పెండింగ్‌లో పడినట్లు తెలుస్తోంది. 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రాష్ట్రంలోనే అతి పెద్ద మునిసిపాలిటీగా ఉన్న మహబూబ్‌నగర్‌ను కార్పొరేషన్ చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చేసిన విన్నపం మేరకు కార్పొరేషన్ కళ సాకారమైంది.

కార్పొరేషన్ హోదాలోనే ఎన్నికలు

పురపాలికల ప్రస్తుత పాలకమండలి గడువు ఈనెల 26తో ముగియనుంది. ఆలోగా ఎన్నికలు జరిగే అవకాశం లేనందున 27 నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల కాలపరిమితి ఇప్పటికే ముగిసినందున ప్రభుత్వం ముందుగా వాటికి ఎన్నికలు నిర్వహించే ప్రయత్నం చేస్తోంది. సర్పంచ్ తరువాత ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించి, అనంతరం మునిసిపల్ ఎన్నికలు నిర్వహించనుంది. అంటే మునిసిపల్ ఎన్నికల నిర్వహణకు మరో 4-6 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఆలోగా కార్పొరేషన్‌కు సంబంధించిన వార్డుల విభజన ప్రక్రియను పూర్తి చేసి, పాలమూరులో ఇక కార్పొరేషన్ హోదాలోనే ఎన్నికలను నిర్వహించనున్నారు.

చైర్మన్, కౌన్సిలర్‌లకు ప్రస్తుత పాలక మండలే చివరిది కానుంది. వచ్చే ఎన్నికల తరువాత చైర్మన్ స్థానంలో మేయర్, కౌన్సిలర్ స్థానంలో కార్పొరేటర్‌లు ఉండనున్నారు. ఎన్నికయ్యే నాయకుల హోదా పెరగనుంది.

థర్డ్ గ్రేడ్ నుంచి కార్పొరేషన్ దాకా

మహబూబ్‌నగర్ థర్డ్ గ్రేడ్ మునిసిపాలిటీ నుంచి అంచెలంచెలుగా ఎదిగి, కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందింది. పాలమూరు పురపాలిక 1952లో ఏర్పాటు కాగా, అప్పుడు థర్డ్‌గ్రేడ్ మునిసిపాలిటీ హోదా ఉండేది. ఆ తరువాత 1959లో సెకెండ్ గ్రేడ్ మునిసిపాలిటీగా, 1983లో గ్రేడ్ 1 మునిసిపాలిటీగా, 2004లో స్పెషల్ గ్రేడ్ మునిసిపాలిటీ హోదాను సొంతం చేసుకుంది. ప్రస్తుతం సెలెక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీ నుంచి కార్పొరేషన్ స్థాయికి ఎదిగింది. 2012లో పాలమూరు చుట్టుపక్కల ఉన్న 10 గ్రామాలను మునిసిపాలిటీలో విలీనం చేయగా, తాజాగా రెండు గ్రామాలను విలీనం చేసి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. మొదట 18 వార్డులతో ఏర్పాటైన మునిసిపాలిటీ ఆ తరువాత 27 వార్డులకు, అనంతరం 32 వార్డులకు పెరిగింది. పట్టణం పెరగడంతో వార్డుల సంఖ్య 38కి పెరిగింది. ఆ తరువాత 41 చేశారు. విలీన గ్రామాలు కలువడంతో ఈ సంఖ్య కాస్త 49 వార్డులకు చేరింది. కార్పొరేషన్ కావడంతో 51కి పెరిగే అవకాశం ఉంది.

1952 నుంచి 13 మంది చైర్మన్‌లు

పాలమూరు పురపాలిక ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 13 మంది చైర్మన్‌లుగా పని చేశారు. 1952-53 కాలంలో శంకర్‌రావు చైర్మన్ అయ్యారు. 1953-57లో ఆర్ శ్రీనివాసరావు, 1957-61లో ఇబ్రహీం అలీ అన్సారి, 1961-1967లో సత్తూరు రంగయ్య, 1967-72లో జి.రామలింగయ్య, 1981-86లో జి.సహదేవ్ యాదవ్, 1987-92లో బి.బాలకిష్టారెడ్డి, 1995-2000లో ముత్యాల ప్రకాశ్, 2005-2011లో ఒబేదుల్లా కొత్వాల్, 2014-18లో రాధా అమర్, 2019-2023 కేసీ నర్సింహులు, 2024 నుంచి ఏ అనంద్‌కుమార్‌గౌడ్ చైర్మన్‌గా ఉన్నారు.

రూ.400 కోట్లకు ప్రతిపాదనలు చేశాం



మహబూబ్‌నగర్ మునిసిపాలిటీని కార్పొరేషన్ చేస్తూ, గెజిట్ వచ్చింది. దాంతో పట్టణం మరింత వేగంగా అభివృద్ధి చెందనుంది. నిధులు అధికంగా వచ్చే అవకాశం ఉంది. కార్పొరేషన్ ఏర్పాటు కావడంతో వార్డుల విభజన కూడా జరగనుంది. ఇప్పటికే ముఖ్యమంత్రికి రూ.400 కోట్లకు ప్రతిపాదలు ఇచ్చాము. అందులో ఖచ్చితంగా రూ.250 కోట్లు అయినా ఇవ్వాలని అడగడం జరిగింది.

- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే

కార్పొరేషన్ కావడం ఆనందంగా ఉంది



పాలమూరు పురపాలిక కార్పొరేషన్ కావడం ఆనందంగా ఉంది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కృషి, ప్రయత్నం కారణంగా ముఖ్యమంత్రి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాలమూరులో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కార్పొరేషన్ అయినందన ఎమ్మెల్యే ఆదేశానుసారం అన్ని వార్డులు తిరిగి, పెద్ద ఎత్తున ప్రతిపాదనలు తయారు చేశాం. ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రికి నిధుల కోసం నివేదించాం.

- ఆనంద్‌కుమార్‌గౌడ్, మునిసిపల్ చైర్మన్

స్పోర్ట్స్ బాక్స్

సత్తా చాటిన కందనూలు యువకుడు

» 'మాస్టర్స్ అథ్లెటిక్స్'లో మూడు పతకాలు



డిస్కస్ త్రో చేస్తున్న సోలపోగుల స్వాములు

కందనూలు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నగరంలో సోమవారం నిర్వహించిన 14వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ సోలపోగుల స్వాములు సత్తా చాటారు. వివిధ క్రీడాంశాల్లో అద్భుతమైన ప్రదర్శనతో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.విజేందర్ యాదవ్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు జావెలిన్‌త్రోలో బంగారు, డిస్కస్‌త్రోలో వెండి, షాట్‌పుట్‌లో కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా స్వాములును అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు లావణ్యరెడ్డి, లక్ష్మి, భిక్షపతి, కోశాధికారి విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు పరశురామ్, అంజయ్య, కొర్ర రాములు, సభ్యులు శివకుమార్, శ్రీకాంత్, శేఖర్, హైమావతి, విష్ణు తదితరులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ టోర్నీలో ఉమ్మడి పాలమూరుకు మూడవ స్థానం



మూడవ స్థానంలో నిలిచిన ఉమ్మడి పాలమూరు జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన అంతర్ జిల్లా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ బాలుర జట్టు మూడవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ తఖీయోద్దీన్, శంకర్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా క్రీడాకారులు మరింతగా రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

24న కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ (పురుషులు) జిల్లా జట్టు ఎంపిక పోటీలను ఈనెల 24న నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తి గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల ఒకటి నుంచి నాలుగవ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. 85 కిలోలలోపు బరువు వారు ఎంపిక పోటీలకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు 24న ఉదయం తొమ్మిది గంటలకు జిల్లా ప్రధాన స్టేడియానికి చేరుకోవాలని కోరారు. ఒరిజినల్ ఆధార్ కార్డు తీరుకురావాలని సూచించారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

» మొబైల్ ఫోన్‌కు చార్జింగ్ పెడుతుండగా ఘటన

మాగనూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ ఫోన్‌కు చార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. నారాయణపేట జిల్లా, మాగనూరు మండలం, నేరడుగమ్ము గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ మన్నన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ పంచాయతీ కార్మికుడు పని చేస్తున్న జొల్లు సాయిలు (42) సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో గ్రామంలో నీరు వదిలేందుకు నిద్ర లేచాడు. మొబైల్ ఫోన్‌కు చార్జింగ్ పెడ్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అతడి మృతిపై ఎలాంటి అనుమానాలూ లేవని భార్య అంజమ్మ తెలిపినట్లు పోలీసులు చెప్పారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఎర్రవల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి వద్ద 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉండొచ్చని ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. మెరూన్ రెడ్ షర్ట్, నీలి రంగు పంచను ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహన్ని గద్వాల ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

జడ్చర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని ఎర్రగుట్ట సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నారంటూ విశ్వసనీయ సమాచారం అందడంతో జడ్చర్ల ఎస్‌ఐ శివానందం ఆధ్వర్యంలో దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2700 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

16 లీటర్ల సారా స్వాధీనం

వెల్దండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని నగారాగడ్డ తండా, పోచమ్మగడ్డ తండాల్లో ఎక్సైజ్‌శాఖ, డీటీఎఫ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. 16 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 550 లీటర్ల బెల్లంఊటను పారబోశారు. గోపాల్, పాండు అను వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి నుంచి మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాడులలో ఎక్సైజ్ ఎస్‌ఐ రాజేందర్, స్పెషల్ డ్యూటీ ఎస్‌ఐ పురుషోత్తంరెడ్డి, సిబ్బంది మహేశ్, నార్య, మాధవి, కృష్ణయ్య, ఆలియా, మహేశ్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన వాయిదా

» కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్

ఆత్మకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పర్యటన వాయిదా పడినట్లు కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండల అధ్యక్షుడు పరమేశ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరు కావలసి ఉండగా, అనివార్య కారణాలతో పర్యటనను వాయిదా వేసినట్లు చెప్పారు. ప్రారంభోత్సవ తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు రహమతుల్లా, యూత్ కాంగ్రెస్ మక్తల్ నియోజకవర్గ అధ్యక్షుడు తులసిరాజ్ పాల్గొన్నారు.

నారాయణపేట శివారులో చిరుత సంచారం

నారాయణపేట న్యూటౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట శివారులో సోమవారం సాయంత్రం చిరుత పులి సంచరించింది. పట్టణ సమీపంలో సుభాష్‌రోడ్‌లోని కుమ్మరి వాడ శ్మశాన వాటిక పరిసరాల్లో చిరుత పులి పరుగులు తీస్తుండగా స్థానిక యువకుడు నరేశ్ చూసి, వీడియో తీశాడు. దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది.

శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం



కోరిన కోర్కెలు తీర్చే అభయాంజనేయుడు

» ఈనెల 25 నుంచి ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు కొనసాగనున్న బ్రహ్మోత్సవాలు



అభయాంజనేయస్వామి మూలవిరాట్టు

ఊర్కొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చే ఇలవేలుపుగా ఊర్కొండపేట అభయాంజనేయుడు భక్తుల పూజలందుకుంటున్నాడు. రోగపీడితులకు ఉపశమనం కలిగించే దేవుడని భక్తులు విశ్వసిస్తారు. ప్రతీ మంగళ, గురు, శని వారాల్లో భక్తులు స్వామి వారిని అధిక సంఖ్యలో దర్శించుకొని పూజలు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండల కేంద్రా నికి మూడు కిలోమీటర్ల దూరంలోని ఊర్కొండపేట లో స్వామి వారు కొలువై ఉన్నారు. ఆలయానికి ఇరువైపులా రెండు ఎత్తయిన కొండలున్నాయి. అందుకే ఈ క్షేత్రానికి ఊరుకొండపేటగా పేరొచ్చిందని స్థానిక పెద్దలు చెప్తుంటారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల ఒకటవ తేదీ వరకు ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్షేత్ర ప్రాధాన్యం, విశిష్ఠతలు, ఉత్సవాల వివరాలతో ప్రత్యేక కథనం..

కాళికామాత వర్చస్సులో స్వామి వారు

ఆలయంలోని ఆరు అడుగుల ఆంజనేయస్వామి ప్రతిమ కాళికా మాత వర్చస్సులో ప్రకాశిస్తుంటుంది. సాధారణంగా ఆంజనేయస్వామి విగ్రహాన్ని సింధూర లేపనంతో అలంకరిస్తుంటారు. కానీ ఇక్కడ స్వామి వారికి సింధూర లేపనం ఉండదు. ఎత్తయిన ఆలయం, విశాలమైన ప్రాకారాలతో ఆలయ సముదాయం రాజదర్బారులా కనిపిస్తుంది. కొండపైనున్న గుండంలో భక్తులు పుణ్యస్నానం చేస్తారు. ప్రతీ సంవత్సరం పుష్య మాసంలో చివరి శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమై వారం రోజుల పాటు కొనసాగుతాయి. శకటోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమై చక్రతీర్థ స్నానంతో ముగుస్తాయి. శకటోత్సవం సందర్భంగా దూర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఎద్దుల బండ్లతో తరలివస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు నల్లగొండ, రంగారెడ్డి, కర్నూల్, హైదరాబాద్, మెదక్, ప్రకాశం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

శకటోత్సవంతో ప్రారంభం

అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి తెలిపారు. 25వ తేదీన ఉదయం ఊర్కొండపేటలోని అర్చకుడు, దివంగత చిరివెళ్లి కృష్ణమూర్తి శర్మ ఇంటి నుంచి ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తారు. ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం, స్వామి వారికి పంచామృతాభిషేకం, నూతన వస్త్రధారణ, వెండి ఆభరణాల అలంకారం తదితర విశేష పూజలు నిర్వహిస్తారు. 11 గంటలకు శకటోత్సవం (బండ్ల ప్రదక్షిణ) జరుగనున్నది. 26న ఉదయం పంచ సూక్తాలు, సహస్ర నామార్చన అనంతరం స్వామి వారికి గజ వాహన సేవ ఉంటుంది. 27న రాత్రి రథోత్సవం నిర్వహిస్తారు. 28న రాత్రి పల్లకీసేవ, హరికథ కాలక్షేపం ఉంటాయి. 29న ఉదయం విశేష పూజలు, రాత్రి ఒంటె వాహన సేవ, 30వ తేదీన రాత్రి నెమలి వాహన సేవ, 31న రాత్రి పల్లకీ సేవ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి ఒకటవ తేదీన విశేష పూజల అనంతరం 11 గంటలకు చక్ర తీర్థ స్నానం ఉంటుంది. సాయంత్రం ఆరు గంటలకు ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి దివంగత చిరివెళ్లి కృష్ణ మూర్తి ఇంటికి చేర్చడంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ఉత్సవాలకు పూర్తయిన ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేశాం. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాం. స్వచ్ఛ భారత్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం. పోలీసుల పటిష్ఠ బందోబస్తు మధ్య బ్రహ్మోత్సవాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా ఏర్పాట్లు చేశాం.

- సత్యచంద్రారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి

ఆలయ అభివృద్ధికి కృషి



బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఉత్సవాలను విజయవంతం అయ్యేందుకు సహకరించాలని భక్తులు, గ్రామస్థులను కోరుతున్నాం.

- సత్యనారాయణరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్



విద్యుద్దీపాల వెలుగులో దర్గా

రేపటి నుంచి మర్దాన్ అలీషా ఉర్సు

» శకటోత్సవంతో ప్రారంభం కానున్న ఉత్సవాలు » 23న గంధోత్సవం, 24న ఖవ్వాలీ

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో హజ్రత్ సయ్యద్ మర్దాన్ అలీషా రహెమత్ అల్లా అలై దర్గా 99వ ఉర్సు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్నది. అందుకోసం షాసాహెబ్ గుట్టలోని దర్గాలో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి రోజు గుస్లే షరీఫ్ (అభిషేకం) నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గంధోత్సవాన్ని 23వ తేదీన వైభవంగా నిర్వహించనున్నారు. పట్టణంలోని షేక్ మొహియోద్దీన్ ఇంటి నుంచి గంధోత్సవం ప్రారంభం కానున్నది. గంధాన్ని వన్‌టౌన్, న్యూటౌన్‌ల మీదుగా దర్గాకు తీసుకెళ్తారు. అనంతరం దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. 24 దీపారాధన, ఖవ్వాలి ఉంటాయి. 25వ తేదీన ఖత్‌మే ఖురాన్ నిర్వహించనున్నారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాషా ఖాద్రీ ఉర్సు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉర్సుకు జిల్లా కేంద్రంతో పాటు, హైదరాబాద్, నారాయణపేట, గద్వాల, షాద్‌నగర్, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, అచ్చంపేట, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు.

రైతులకు అన్యాయం చేయొద్దు

» పొలాలు ముంపునకు గురి కాకుండా చూడాలి » ప్రజా ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాఘవాచారి

» ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణంపై రైతులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవాచారి, వేదికపై నాయకులు సీతారాంరెడ్డి, ఇంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాగయ్య, తిరుపతయ్య తదితరులు

బల్మూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులకు అన్యాయం చేయొద్దని ప్రజా ఐక్య వేదిక ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు రాఘవాచారి అన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న పొలాల్లో ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మిస్తామంటూ ఇంజనీర్లతో సర్వే చేయించడాన్ని ఆయన తప్పు పట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం రైతుల భూముల్లో రిజర్వాయర్‌ను నిర్మిస్తామనడం సరి కాదన్నారు. రసూల్ చెరువు, కొచ్చెరువు, రామగిరి ప్రాంతాల్లోని ప్రభుత్వ భూమిలో నిర్మించాలని డిమాండ్ చేశారు. 2.67 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్తున్న నాయకులు, ఇంజనీర్లు ప్రజల భూములు ముంపునకు గురి కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

మైలారం గుట్ట మీద జరుగుతున్న మైనింగ్‌పై గ్రామస్థులతో మాట్లాడేందుకు వస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్‌లను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. మైలారం గ్రామస్థుల ఆందోళనకు మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర రిజర్వాయర్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు సీతారాంరెడ్డి, ఇంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాగయ్య, తిరుపతయ్య, బాలస్వామి తదితరులున్నారు.

వెంకటేశ్వర పౌల్ట్రీ పరిశ్రమ తనిఖీ

మిడ్జిల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వెంకటేశ్వర కోళ్ల పరిశ్రమను సోమవారం పశుసంవర్ధక శాఖ రాష్ట్ర, జిల్లా అధికారులు తనిఖీ చేశారు. బృందం చైర్మన్ ఆర్‌ఎస్ చటర్జీ, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ మల్లీశ్వరి, సభ్యులు డాక్టర్ అరుణాశర్మ, డాక్టర్ సోనియాశర్మ, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ మధుసూదన్‌గౌడ్ పౌల్ట్రీలో గ్రాండ్ పేరెంట్ స్టాక్‌ను పరిశీలించారు. వ్యాధుల నివారణకు చేపడుతున్న ముందస్తు చర్యలపై ఆరా తీశారు. వారి వెంట పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జీ.సునిత, డాక్టర్ షకీల్, డాక్టర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్, సిబ్బంది సాగర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై కేసు నమోదు

కోస్గి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బాల్‌రాజ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా, కోస్గి మండలంలోని సర్జఖాన్‌పేట్‌కు చెందిన కృష్ణయ్య గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పోలీసులపై అసభ్యకరంగా మాట్లాడి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ విషయంపై ఈ నెల 11న అదే గ్రామానికి చెందిన హరీశ్ గౌడ్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి

» టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న పేదలు, నాయకులు

పాలమూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని పేదలు ముట్టడించారు. పట్టణంలోని సర్వే నెంబరు 523లో తమ ఇంటి స్థలాల పట్టా సర్టిఫికెట్‌లను 2018లో ప్రభుత్వానికి స్వాధీన పరిచామని వారు తెలిపారు. దీంతో తమను డబుల్ బెడ్‌రూం ఇళ్లు పొందటానికి అర్హులుగా నిర్ధారించారన్నారు. కానీ మళ్లీ విచారణ పేరుతో జాప్యం చేయడం ఏంటని ఆందోళనకారులు ప్రశ్నించారు. సర్వేలు, విచారణ అంటూ కాలయాపన చేయడమంటేనే అర్హులకు అన్యాయం చేయడమేనని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో తమకు అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అర్బన్ తహసీల్దార్ ఘాన్సీరామ్‌కు అందచేశారు. కార్యక్రమంలో టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎన్ ఖలీల్, నాయకులు విజయ్‌కుమార్, యాదగిరి, పలాల్‌పాషా, గట్టన్న, జయపాల్, బాలకృష్ణ, టీపీజేఏసీ నాయకులు రామకృష్ణ, నాయకులు గోవింద్, బాధితులు బషీర్, కుమ్మరిరాజు, హనీఫా బేగం, శ్రీదేవి, అస్మిన్‌బేగం, శంకరమ్మ, ఫర్మానాబేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆర్టీసీ బస్సు ఢీకొని

మహిళ దుర్మరణం

» నారాయణపేట మండలం, సింగారం క్రాస్‌రోడ్ వద్ద ఘటన



మణెమ్మ (ఫైల్)

నారాయణపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ప్రైవేట్ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. నారాయణపేట మండల పరిధిలోని సింగారం క్రాస్ క్రాసింగ్ వద్ద సోమవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామానికి చెందిన మణెమ్మ (36) చెల్లెలి కొడుకును సింగారం చౌరస్తాలోని గురుకుల పాఠశాల వదిలిపెట్టింది. తర్వాత బస్సు ఎక్కేందుకు చౌరస్తాకు వచ్చి రోడ్డు పక్కనున్న హోటల్‌లో టిఫిన్ చేసింది. అప్పుడు బస్సు రావడంతో హడావిడిగా పరుగెత్తుకు వచ్చింది. అదే సమయంలో బస్సు ముందుకు కదలడంతో మాణిక్యమ్మ ముందు టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని జిల్లా అసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ డిపో ముందు గ్రామస్థుల ఆందోళన

ఆర్టీసీ ప్రైవేట్ బస్సు ఢీకొని మృతి చెందిన మణెమ్మ కుటుంబానికి తక్షణ పరి హారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి వత్తుగుండ్ల గ్రామస్థులు, బంధువులు నారాయణపేట ఆర్టీసీ డిపో ముందు ఆందోళన చేపట్టారు. వారికి సీపీఎం నాయకులు వెంకట్రామిరెడ్డి, బాల్‌రామ్, గోపాల్ తదితరులు సంఘీభావం తెలిపారు. బస్సు యజమాని గోపాల్‌రెడ్డి రావాలంటూ పట్టుబట్టారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ లావణ్య వారితో మాట్లాడారు. సంఘటనపై కేసు నమోదు అయినందున బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ వస్తుందని చెప్పారు. ఆందోళనను విరమించుకోవాలని సూచించారు. కానీ తక్షణ పరిహారం ఇప్పించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఎస్‌ఐ వేంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని వారితో చర్చించారు.



డిపో ముందు ధర్నా చేస్తున్న గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు

న్యూస్ బాక్స్

పోస్టర్ విడుదల

హన్వాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన హన్వాడలో సోమవారం సీపీఐఎం నాల్గవ రాష్ట్ర మహాసభ పోస్టర్లను సీపీఐఎం మండల కార్యదర్శి లక్ష్మయ్య, నాయకులు విడుదల చేశారు. ఈనెల 25 నుంచి 28 సంగారెడ్డి జిల్లాలో జరిగే సభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు టంకర రాములు, ర్యాకమయ్య, బాలకిష్టయ్య పాండు పాల్గొన్నారు.

కొనసాగిన ధాన్యం కొనుగోలు

దేవరకద్ర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,671, కనిష్ఠంగా రూ.2,609, పలకగా, కందులు క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.7,212, కనిష్ఠంగా రూ.6,729 పలికింది. కాగా మార్కెట్‌కు హంస తొమ్మిది క్వింటాళ్లు, సోన ఏడు క్వింటాళ్లు, కందులు 44 క్వింటాళ్లు వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా టీసీ శ్రీను

దేవరకద్ర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా టీసీ శ్రీనువాసులును నియమిస్తూ సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు నియామక పత్రం అందజేశారు. రజినికాంత్, శ్రీను, యాదయ్య, నరేష్, రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

జడ్చర్ల/గండీడ్/మహమ్మదాబాద్/మిడ్జిల్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలకు సంబంధించిన జాబితాలను ఆమోదించేందుకు నేటి నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు జడ్చర్ల ఎంపీడీవో విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఉమ్మడి మండలం గండీడ్, మహ్మదాబాద్ మండలాల్లో నేటి నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దేవన్న ఒక ప్రకటలో తెలిపారు. మిడ్జిల్ మండలంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గీతాంజలి సోమవారం తెలిపారు. గ్రామ సభలలో ప్రత్యేకాధికారి వెంకటేష్, తహసీల్దార్ రాజు పాల్గొంటారని తెలిపారు.

గ్రామ సభల్లో అర్హుల పేర్లు ఆమోదించాలి

జడ్చర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభల్లో అర్హులందరీ పేర్లు ఆమోదించాలంటూ ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అధికారులకు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరులో ఏ ఒక్క పేద కుటుంబానికి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. గ్రామ సభలలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొని అర్హుల జాబితాకు ఆమోదం తెలపాలన్నారు. అధికారులు ఆమోదించిన జాబితాలో అర్హుల పేర్లు లేవని, ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్రామ సభలలో ఆమోదించిన జాబితాను క్యాంపు కార్యాలయానికి పంపాలని కోరారు.

గ్రామ సభలో చదివి వినిపించాలి

భూత్పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేల వివరాలను నేటి నుంచి జరిగే గ్రామ సభల్లో వివరాలను చదివి వినిపించాలని ఎంపీడీవో ప్రభాకర్ చారి అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వే అధికారుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేకాధికారి వేణుగోపాల్, తహసీల్దార్ రహమాన్, పాల్గొన్నారు.

పథకాల అమలుపై చర్చించాలి

కోయిలకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులపై నేటి నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి చర్చించాలని ఎంపీడీవో కాళప్ప సోమవారం అధికారులకు సూచించారు.

ముగిసిన పరిశీలన

హన్వాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా, రేషన్‌కార్డు, ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకల అమలుపై అధికారులు గ్రామాల్లో నిర్వహించిన పరిశీలన సోమవారంతో ముగిసింది. మండలంలోని నాయినోనిపల్లి, ఎల్లంబాయితండా, మాధారం, నాగంబాయితండా, కిష్టంపల్లి గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి పరిశీలించారు. ఎంపీడీవో యశోదమ్మ, తహసీల్దార్ కిష్ట్యనాయక్, నాయకులు నర్సిములు, తిరుపతయ్య, కొండ తిరుపతయ్య, మోహన్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

మిడ్జిల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సమీపంలోని దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మిడ్జిల్ గ్రామానికి చెందిన భాస్కర్‌గౌడ్ తహసీల్దార్ రాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. తాము ఇంటి నిర్మాణానికి సంచులలో ఇసుకను తీసుకెళ్తే పట్టుకొని కేసులు నమోదు చేసిన పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మూసాపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిజాలాపూర్‌లో ముగ్గురు లబ్ధిదారులకు కాంగ్రెస్ మండల నాయకులు పంపిణీ చేశారు. గొల్ల ఆంజన్నకు రూ.42 వేలు, మౌనికసాగర్‌కు రూ.17 వేలు, పిచ్చకుంట నర్సింహులుకు రూ.14 వేల చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వి.రాంచందర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోవర్ధన్, శ్రీనివాస్, ప్రకాశ్, శ్రీపురం శ్రీను, మన్నెంకొండ పాల్గొన్నారు.

పరిష్కారాలు వేగవంతం చేయాలి

▸ కలెక్టర్ విజయేందిర బోయి ▸ ప్రజావాణికి 85 దరఖాస్తులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు పరిశీలించి, సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయాల సమావేశపు మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ప్రజలు నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఈ ప్రజావాణి కార్యక్రమంలో 85 మంది దరఖాస్తులు చేసుకున్నారని, ప్రతీ ఒక్క దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేకుంటే వారికి తగు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. శాఖల వారిగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా చేపట్టవలసిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహిస్తున్నందున అందుకు అనుగుణంగా వేదిక, సిట్టింగ్ ఏర్పాట్లను చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్య నిర్వహణ చేయాలని మునిసిపల్ కమిషన్‌ను ఆదేశించారు. సౌండ్, సిస్టం ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీయర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. అలాగే వివిధ శాఖల అభివృద్ధి ప్రగతి నివేదికలు ముఖ్య అతిథి సందేశం కోసం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి అందజేయాలని సూచించారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని డీఆర్వో, కలెక్టరేట్ ఏవోను ఆదేశించారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈవోను ఆదేశించారు. 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. అగ్ని ప్రమాద నివారణకు అగ్నిమాపక వాహనం సిద్ధంగా ఉంచాలని ఆ శాఖ అధికారిని ఆదేశించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయుటకు 23లోగా ఉత్తమ ఉద్యోగుల జాబితా అందజేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అలంకరణ, లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అదనపు ఎస్పీ రాములు, ఆర్డీవో నవీన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

▸ మునిసిపల్ కార్యాలయం ఎదుట కౌన్సిలర్ల నిరసన



భూత్పూర్ మునిసిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

భూత్పూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వార్డు కౌన్సిలర్లు సోమవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు మురళిధర్‌గౌడ్, వార్డు కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ మాట్లాడారు. మూడు నెలల క్రితం మునిసిపల్ కమిషనర్ బదిలీపై వెళ్లిపోయారని, ఆయన స్థానంలో కొత్త కమిషనర్‌ను ప్రభుత్వం నియమించకుడా జడ్చర్ల కమిషనర్‌ను ఇన్‌చార్జిగా నియమించారని, దీంతో మునిసిపాలిటీలో సమస్యలు తీవ్రమయ్యాయని వారు ఆరోపించారు. మునిసిపాలిటీ పార్కుల్లో నీరు సరఫరా చేసే ట్రాక్టర్ మరమ్మతు కోసం మూడు నెలల నుంచి రూ.20,000 చెల్లించలేక రిపేరు చేసే షెడ్డులోనే ఉండిపోయిందన్నారు. దీంతో మొక్కలకు నీరు లేక ఎండిపోతున్నాయని కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో సమస్యలను పట్టించుకొనే నాథుడే కరువయ్యారని నాయకుడు మురళిధర్‌గౌడ్ మండిపడ్డారు. వార్డుల్లో వీధి లైట్లు, మురుగు కాలువల శుభ్రం చేసే వారు లేరన్నారు. ప్రభుత్వం రెగ్యులర్ కమిషనర్ నియమించి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు నారాయణగౌడ్, మేకల సత్యనారాయణ, జాకీర్ పాషా, అశోక్‌గౌడ్, బీజేపీ నాయకుడు ఫారుక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులతో ఎంపీడీవో జయరాములు

నవాబ్‌పేట/రాజాపూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ కర్తవ్యమని ఎంపీడీవో జయరాములు అన్నారు. సోమవారం మండలంలోని రుద్రారం, హన్మసానిపల్లి, కారుకొండ గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో పాల్గొని ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులతో పాటు ఇతర సమస్యలపై చర్చించారు. రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లిలో రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పర్యటించి సర్వేను నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి ఇందిరా, ఎంపీడీవో మచ్చెందర్, డీటీ భారతి, ఏఈవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నరేష్, రాజేశ్వరి, రమేష్, శ్రీనివాసులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

బీసీ పొలిటికల్ జేఏసీ మండలాధ్యక్షుడిగా తిరుపతయ్యగౌడ్

మూసాపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : బీసీ పొలిటికల్ జేఏసీ మండలాధ్యక్షుడిగా నల్ల తిరుపతయ్యగౌడ్ సోమవారం నియామకయ్యారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించి నియామక పత్రాన్ని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాచాల యుగంధర్‌గౌడ్ అందజేశారు. బీసీలు ఉద్యోగ, ఉపాధి, రాజకీయ ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందడానికి తమవంతు కృషి చేస్తానన్నారు.

విద్యార్థినులకు కరాటే శిక్షణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు సీనియర్ కరాటే మాస్టర్ ఎత్తిన చెన్నయ్య ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.పద్మ మాట్లాడుతూ మహిళలు మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని, ఆత్మరక్షణ రక్షణ కరాటే ఎంతో అవసరని తెలిపారు. ఉచిత శిక్షణను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యాపకులు అమీనా ముంతాజ్, శ్రీదేవి, వాసంతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిన్నచింతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కురుమూర్తి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దాసరి గంగన్న ఆకస్మికంగా మృతి చెందారు. సోమవారం మృతుడి స్నేహితులైన ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు భాస్కర్‌గౌడు, బాలస్వామి, రవికుమార్, రాజునాయుడు, సలాం, రాజు, మహేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

చిన్నచింతకుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ఆయా సంక్షేమ పథకాలు అమలు నిరం తర ప్రక్రియ అని కాంగ్రెస్ మండల అధ్యక్షు డు నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మం డల కేంద్రంలోని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డులు లేని వారు, భూమిలేని నిరుపేదలు దరఖాస్తు చేసుకునేందుకు ఇది చక్కటి అవకాశం అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వట్టెం శివకుమార్, ఎద్దుల మధుసూదన్‌రెడ్డి, రంజిత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జహంగీర్ పీర్ల దర్గా ఉర్సు



ముస్తాబైన జహంగీర్ పీర్ల దర్గా

మూసాపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం పెద్ద మునగాల్‌చేడ్ జహంగీర్ పీర్ల దర్గా ఉర్సు ఈనెల 22 నుంచి 24వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హజరత్ బాబు తెలిపారు. బుధవారం రాత్రి అడ్డాకుల మండల కేంద్రంలోని దర్గా నిర్వాహకుడు శంకర్‌రావు ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా దర్గాకు చేరుకుంటుందన్నారు. 23న దీపారాధన, 24న జియారత్, ఫాతేహా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

జడ్చర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని తాలుకా క్లబ్ రోడ్డు ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను జడ్చర్ల పోలీసులు పట్టుకున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లుగా గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

జడ్చర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం కిష్టంపల్లి గ్రామానికి చెందిన నాయీ బ్రాహ్మణుడు నిరంజన్ కుటుంబానికి బాదేపల్లి నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందచేశారు. సోమవారం నిరంజన్ దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న వారు పరామర్శించి, ఆర్థిక సాయం అందచేశారు. సంఘం సభ్యులు భీమయ్య, నిరంజన్, శివప్రసాద్, నర్సిములు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం - డ్రైవర్‌కు గాయాలు

మూసాపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండలం శాఖాపూర్ టోల్‌ప్లాజా దగ్గర ముందుగా వెళ్తున్న లారీని వెనక నుంచి డీసీఎం ఢీకొంది. ఈ సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. కలకత్తాకు చెందిన డెకెరేషన్ టీమ్ లేబర్ డీసీఎంలో హైదరాబాద్ నుంచి ఏపీ రాష్ట్రం కడపలో నిర్వహించబోయే సీఎం సమావేశ వేదిక అలంకరణ కోసం వెళ్తున్నారు. టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే ముందుగా వెళ్తున్న లారీని అదుపు తప్పి ఢీ కొట్టగా డీసీఎం డ్రైవర్ దీనాన్‌జీ తీవ్రంగా గాయపడ్డాడు. 12 మంది కూలీలు సురక్షితంగా బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

బాలనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంవత్సర కాలంగా బాలానగర్ మండల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన 220 సెల్‌ఫోన్‌లు చోరీ జరిగనట్లు జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ తెలిపారు. సోమవారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 220 సెల్‌ఫోన్లకు గానూ 126 సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకగా రూపొందిన టెలికామ్ డిపార్ట్‌మెంట్‌లో యాప్ ద్వారా ఫోన్లు రికవరీ చేశామన్నారు. అనంతరం సెల్‌ఫోన్‌లను బాధితులకు అందజేశారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

మిడ్జిల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆటో డ్రైవర్ యూనియన్, సభ్యులు, వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉంచుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రామాంజనేయ ఆటో యూనియన్ అధ్యక్షుడు షేక్ సలీం, అంజిరెడ్డి, రాజు, మెహబూబ్ ఉన్నారు.

ఉపాధ్యాయులపై దాడికి నిరసన



మణికొండ గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/మిడ్జిల్/కోయిలకొండ/దేవరకద్ర/మూసాపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయ రాములుపై జరిగిన దాడిని నిరసిస్తూ ఉపాధ్యాయులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మణికొండ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, వర్కింగ్ ప్రసిడెండ్ నాగిరెడ్డి పాల్గొన్నారు. మిడ్జిల్ మండలం చిలువేరు ప్రభుత్వ పాఠశాలో భోజన విరామ సమయంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కోయిలకొండ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో టీచర్స్ జిల్లా అధ్యక్షుడు ఆదిత్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. దేవరకద్ర మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. అడ్డాకుల మండల కేంద్రంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అదే విధంగా నిజామాబాద్ జిల్లా కోటగిరి పాఠశాలలో కొందరు మతం ముసుగులో మల్లికార్జున్ ఉపాధ్యాయుడిపై దాడి చేయడం తగదన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలేపల్లి గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌కు గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. నిధుల దుర్వినియోగంలో బాధ్యులైన సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులలో కేవలం గ్రామ పంచాయతీ కార్యదర్శిని మాత్రమే సస్పెండ్ చేశారని, మిగతా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ వినతిలో పేర్కొన్నారు. దుర్వినియోగమైన నిధులు రికవరీ చేయాలని కోరారు. గ్రామస్థులు నాగోజీ, యాదయ్య, రాఘవేందర్, యాదయ్య, రాములు గౌడ్, పోచయ్య ఉన్నారు.

సీలింగ్ భూమి రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

జడ్చర్ల మండలం కోడ్గల్ గ్రామ పంచాయతీ పరిధిలోని సీలింగ్ భూమిని అక్రమంగా గ్రామానికి చెందిన కొందరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారంటూ కుర్వపల్లికి చెందిన ఈర్లపల్లి అంజనేయులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 40 సంవత్సరాల నుంచి సీలింగ్ భూమిలో ఐదుకెరాల 21 గుంటల భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, తమ పేరుపై పట్టాకాలేదం టూ ఫిర్యాదులో పేర్కొన్నారు. అట్టి భూమిని గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని, మరొకరికి విక్రయించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్

మహబూబ్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : చాలా ఏళ్ల తరువాత రేషన్‌కార్డులను అర్హులకు ఇచ్చే కార్యక్రమాన్ని కాంగ్రెస్ చేపడుతోందని, అర్హులను ఎంపిక చేయడంలో పూర్తి పారదర్శకత పాటించాలని మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. అర్హులకు అన్యాయం జరగకూడదని, ఎక్కడా పొరపాట్లకు అవకాశం లేకుండా ఎంపికలు చేయాలన్నారు. సోమవారం మునిసిపల్ సమావేశ మందిరంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి వార్డు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం జరిగే వార్డు సభలలో రేషన్ కార్డుల లబ్ధిదారుల వివరాల సేకరణను విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా వార్డుల్లో ఉన్న సమస్యలను అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని వివరించారు.

స్పౌజ్ బదిలీల్లో జిల్లాకు 132 మంది టీచర్లు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జీవో 317 బదిలీల్లో నష్టపోయి సుదీర్ఘకాలంగా పోరాడిన స్పౌజ్ టీచర్లకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, విద్యాశాఖ డైరెక్టర్ నరసింహరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. ఇందుకు సంబంధించి భార్యాభర్తలు వేర్వేరు జిల్లాలో పనిచేస్తూ తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు మంత్రివర్గ ఉప సంఘం పలు మార్లు చర్చించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్టీయూ వ్యవస్థపకుడు హర్షవర్ధన్‌రెడ్డి కూడా కీలకపాత్ర పోషించారు. సోమవారం విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో వివిధ జిల్లాల నుంచి పాలమూరు జిల్లాకు 132 మంది టీచర్లు స్పౌజ్ ఆధారిత బదిలీ పొందారు. వీరంతా వారు పని చేస్తున్న జిల్లా నుంచి రిలీవ్ అయిన తర్వాత జిల్లాకు వస్తారు. ఆ వెంటనే జిల్లా ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఆయా టీచర్ల భార్యలు, భర్తలు ఎక్కడ పని చేస్తున్నారో వారు చేసే పాఠశాలలో ఖాళీ ఉంటే అదే పాఠశాల, లేకుంటే సమీప పాఠశాలకు కేటాయించనున్నారు.

విద్యాశాఖ కార్యాలయ ఏడీగా అనురాధ



డీఈవో ప్రవీణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీ అనురాధ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీగా అనురాధ సోమవారం డీఈవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఏడీగా పని చేసిన అనసూయ హైదరాబాద్‌లోని ఆర్జేడీ కార్యాలయానికి బదిలీపై గత డిసెంబరు 31న వెళ్లారు. దీంతో హైదరాబాద్ డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అనురాధ పదోన్నతిపై పాలమూరు వచ్చారు. అంతకుముందు డీఈవో ప్రవీణ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యాలయ సూపరింటెండెంట్ శంభుప్రసాద్, సిబ్బంది హక్, మధుసూదన్, ప్రవీణ్‌కుమార్ పుష్ప గుచ్ఛం అందజేశారు.

అపార్‌పై అవగాహన కలిగి ఉండాలి

కోయిలకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలోని విద్యార్థుల గుర్తింపు కార్డు అపార్ ఆటోమెటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో వెంకట్‌జీ సూచించారు. సోమవారం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఇందులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటోతో పాటు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఎక్కడ చదివినా పాఠశాల పేరుతో సహ అపార్ కార్డులో ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులు ఇంటర్వ్యూలకు, ఉద్యోగాల కోసం వెళ్లినప్పుడు సర్టిఫికెట్ లేకుండా కోడ్ నెంబర్‌తో విద్యార్థి వివరాలు తెలుస్తాయని తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పదిలో వందశాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని షాషాబ్ గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు సాత్విక మెమోరియల్ ట్రస్టు, శ్రీకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు. బీజేపీ నాయకులు పోతుల రాజు, సాత్విక మెమోరియల్ ట్రస్టు చైర్మన్ బొడ్డు మల్లేష్, శశిబాబు పాల్గొన్నారు.